క్లుప్తంగా

పఠన సామర్థ్యాలు పెంచాలి



పద్యాలు చదివిస్తున్న నోడల్ అధికారి ప్రకాశ్

కెరమెరి: విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలను పెంచాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోయగాం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును రికార్డులను తనిఖీ చేశారు. పలువురు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ఆ కోవలోనే విద్యాబోధన చేయాలని సూచించారు. హెచ్ఎం సత్యనారాయణ, టీచర్ రవితేజ ఉన్నారు.

గుంతలు పూడ్చారు..



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

సాక్షి ఎఫెక్ట్..

తిర్యాణి: శ్రీ ఇంక్లిన్ నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా మారడంతో 'గుంతలమయంగా రోడ్డు' అనే శీర్షికన ఈ నెల 7వ తేదీన సాక్షిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఎమ్మెల్యే ఆత్రం సక్కు స్పందించారు. శుక్రవారం గుంతల్లో మొరంను పోసి మరమ్మతులు చేశారు. ఈ పనులను ఎమ్మెల్యే దగ్గరుండి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం ముగిసిన తరువాత నూతన రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మండ్ల జగదీశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ ఉన్నారు.

అదనపు కలెక్టర్‌ను సన్మానించిన రేషన్ డీలర్లు



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న రేషన్‌డీలర్లు

ఆసిఫాబాద్: ఇటీవల నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ వేణును రెబ్బెన మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. పౌర సరఫరాల శాఖ మేనేజర్ గోపాల్, ఆ సంఘం ప్రతినిధులు తణుకు మురళి, పైడి పురుషోత్తం, రాపర్తి శ్రీనివాస్, ప్రసాద్, జానకిరావ్ పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి



జీపీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

కెరమెరి: గ్రామ పంచాయతీ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. శుక్రవారం మండలంలోని ఝరిలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు భవనాలు మంజూరు అయినట్లు తెలిపారు. మరో రెండు మాసాల్లో వాటి నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత ఉండాలని చెప్పారు. సర్పంచ్ న్యానేశ్వర్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

వాంకిడి: మండలంలోని కోమటిగూడ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ ముండె విమలబాయి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీపీ నిధుల నుంచి రూ.9 లక్షలతో సీసీ రోడ్డు మంజూరైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. ఉపసర్పంచ్ పురుషోత్తం, బీఆర్ఎస్ నాయకులు దీపక్ ముండె, తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఆసిఫాబాద్‌అర్బన్: కేజీబీవీలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిన సీఆర్టీ, పీజీ సీఆర్టీల నియామక ప్రక్రియలో భాగంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థుల జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈవో అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. dwokbasg.weebly.com వెబ్‌సైట్‌తోపాటు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలోని నోటీస్‌బోర్డులో జాబితాను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఎంపిక జాబితాపై అభ్యంతరాలు ఉంటే శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటలలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రయాణమెలా..?

- భారీ వర్షాలకు కోతకుగురైన రోడ్లు
- ప్రయాణానికి తప్పని ఇబ్బంది
- వర్షాలు ముగిసిన కనిపించని మరమ్మతులు



ఇంద్రానగర్ గ్రామ సమీపంలో కోతకు గురైన రోడ్డు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే దారుల్లోని ప్రధాన రోడ్లు కోతకు గురికావడంతో ప్రయాణికుల ఇబ్బందులు మాటల్లో చెప్పలేనివి. గడిచిన పక్షం రోజుల క్రితం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు రోడ్లకు చేటుతెచ్చి పెట్టాయి. ఎక్కడికక్కడ దారులు కోతకు గురయ్యాయి. ఫలితంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఆయా రోడ్ల పరిస్థితులను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి వెళ్లినప్పటికీ మరమ్మతులపై దృష్టి పెట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చూస్తేనే భయం!..

మండలంలో ఇటీవల కాలంలో అనేక గ్రామాల్లో ఎస్ఆర్ఈజీస్ నిధులతో అంతర్గత రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అవి పర్వాలేదనుకున్నా.. ప్రధాన రహదారులు పరిస్థితి అధ్వానంగా మారింది. మండలంలోని జోడేఘాట్ వైపునకు వెళ్లే దారిలో పాట్నాపూర్ గ్రామానికి సమీపంలోని కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురైంది. అటు వైపు సుమారు మరో ఐదు గ్రామాలున్నాయి. మరో రెండు మాసాల తర్వాత కుమురంభీం వర్ధంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. దీంతో త్వరలో మరమ్మతులు చేపట్టాలని పోరుగ్రామాల ప్రజలు కోరుతున్నారు. అలాగే ఇందాపూర్ గ్రామం వైపునకు వెళ్లేదారిలో ఇంద్రానగర్, నీంగూడ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు వద్ద ప్రధాన రోడ్డు కోతకు గురై భయంకరంగా మారింది. సుమారు ఐదు మీటర్ల పొడవు కోతకు గురైంది. ఈ వైపు పాదచారులు, ద్విచక్ర వాహనాలు అతికష్టం మీద వెళ్తున్నప్పటికీ పెద్ద వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే ఆగుర్వాడ నుంచి ఉమ్రి గ్రామానికి వెళ్లే రహదారికి రెండు కిలో మీటర్ల దూరం వరకు కచ్చా రోడ్డు ఉంది. పూర్తిగా దారి మధ్యలో కోతకు గురికావడంతో వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఇందాపూర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి

నిధులు రాగానే రోడ్లకు మరమ్మతులు



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో కోతకు గురైన రోడ్ల విషయాన్ని ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేశాం. వాటి మరమ్మతుల కోసం నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రజల ప్రయాణానికి ఇబ్బందికాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం.

– పెందోర్ మోతిరాం, ఎంపీపీ

పనుల్లో అవకతవకలు అరికట్టాలి

- డీఆర్‌డీవో సురేందర్
- కౌటాలలో ఉపాధిహామీ ప్రజావేదిక



కొత్త జాబ్‌కార్డులు అందిస్తున్న అధికారులు

కౌటాల: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు లేకుండా చూడాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 12వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు వంద రోజుల పాటు పని దినాలు కల్పించాలని తెలిపారు. కూలీ చేసిన ప్రతీ ఒక్కరికి తప్పనిసరిగా డబ్బులు చెల్లించాలన్నారు. ఈ పథకంలో అక్రమాలకు చోటు ఇవ్వకుండా పకడ్బందీగా పనులు చేపట్టాలని సూచించారు. అంతకు ముందు 2021–23 మధ్య నిర్వహించిన పనుల వివరాలను తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. గుడ్లబోరి కూలీలు పనులకు వెళ్లకపోయినా మేటిలు హాజరు వేసి కూలీ వద్ద నుంచి సగం కూలి డబ్బులు వసూలు చేశారని, గ్రామంలో విచారణ చేసి అక్రమాలు జరిగి ఉంటే కూలీ డబ్బులు రికవరీ చేయాలని డీఆర్‌డీవో అధికారులను ఆదేశించారు. అలాగే కన్నెపల్లిలో గతంలో చనిపోయిన వ్యక్తి పేరిట పనులు చేసి కూలీ డబ్బులు తీసుకున్నారని, తలోడిలో బీపీఎం కూలీలకు సక్రమంగా డబ్బులు ఇవ్వడం లేదని తెలిపారు. తాటినగర్‌లో పలువురు కూలీలు సెలవు రోజు ఆదివారం కూడా పని చేసినట్లు హాజరు నమోదు చేశారని, బోదంపల్లిలో లబ్ధిదారుడు పశువుల గోట్టంను ఇంటిగా అమర్చి వినియోగించుకుంటూ ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టిస్తున్నారని, తాటిపల్లిలో వంద రోజుల పని దినాలు పూర్తి చేసిన వారికి పని కల్పించడంతో వారికి డబ్బులు రాలేదని వివరించారు. సాండ్‌గాంలో కూలీలకు జాబ్‌కార్డులు ఇవ్వలేదని పేర్కొన్నారు. దీంతో వెంటనే కూలీలకు కొత్త జాబ్ కార్డులను అందించారు. సమావేశంలో జిల్లా అధికారి సాయిశ్రీ, ఎంపీడీవో నస్రుల్లాఖాన్, వైస్ ఎంపీపీ నికాడే అమ్మక్క, ఎంపీవో పూర్ణిమ, ఏపీఎం వెంకటరమణ, ఏపీవో మౌనిక, సిబ్బంది కొముర‌య్య, సాయి, అహ్మద్, సర్పంచులు సోమయ్య, దామోదర్, రాందాస్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

తిర్యాణి: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి పథకం ద్వారా మంజూరైన 21 చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేస్తుందని వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మండ్ల జగదీశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్ అనంతరాజు, నాయకులు గాయంగి మల్లేశ్, శంకర్ గౌడ్ ఉన్నారు.

బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం పోలీసులు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలు వినియోగించడంపై జరిగే అనర్థాలు, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, పోలీసు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సోనియా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలు ఉన్నారు.

వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: పవిత్ర అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాసవీమాత ఆలయంలో అర్చకులు రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, పుష్పార్చన, మహామంత్రపుష్పం, మంగళహారతులు ఇచ్చారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'మన ఊరు–మన బడి' పనుల పరిశీలన

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉర్దూ, తెలుగు మీడియం, సోన్‌పేట ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న మనఊరు – మనబడి పనులను శుక్రవారం ఏఈ శరత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనఊరు– మనబడి పనులు వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట స్కూల్ కమిటీ చైర్మన్ ఇఫాత్ హుస్సేన్, వార్డు సభ్యుడు మోయిజ్, ప్రధానోపాధ్యాయుడు బషీరోద్దీన్ పాల్గొన్నారు.

దళితులపై దాడికి నిరసన



మాట్లాడుతున్న అంబేద్కర్ సంఘం నాయకులు

ఆసిఫాబాద్: కోటపల్లి మండలం శెట్‌పల్లిలో దళిత రైతు దుర్గం బాపుపై అదే గ్రామానికి చెందిన సూరం రాంరెడ్డి దాడి చేయడం హేయమైన చర్య అని నేతకాని ఆసిఫాబాద్ సెంటర్ కమిటీ అధ్యక్షుడు జాడి బాపు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మాహోర్కర్ అశోక్, దుర్గం దిన్‌కర్, చాపిడి సురేశ్, జాడి అశోక్, వినోద్, టీకానంద్, చాపిడి ప్రసాద్, దుర్గం దయానంద్, దుర్గం ఆకాశ్ పాల్గొన్నారు.

అనాథ పిల్లల సర్వే

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలో తల్లిదండ్రులు కోల్పోయిన అనాథ పిల్లలను గుర్తించడానికి డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణమూర్తి తెలిపారు. 23 ఏళ్ల అనాథ పిల్లలను గుర్తించేందుకు ప్రత్యే సర్వే కొనసాగుతుందని, సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని అనాథ పిల్లల వివరాలను తెలియజేయాలని ఆయన కోరారు.

ఎస్పీని కలిసిన సీఐ



ఎస్పీకి మొక్క అందిస్తున్న సీఐ ముత్యంరాజు

ఆసిఫాబాద్: ఇటీవల నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై సీఐగా జిల్లాకు వచ్చిన సీహెచ్ ముత్యంరాజు శుక్రవారం ఎస్పీ సురేశ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో సీసీఎస్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ముత్యంరాజుకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్ రావు పాల్గొన్నారు.

నూతన గృహాలకు భూమిపూజ

వాంకిడి: మండలంలోని ఎనోలి కొలాంగూడ గ్రామంలో ఐటీడీఏ నుంచి మంజూరైన ఐదు గృహాలకు జెడ్పీటీసీ అజేయ్‌కుమార్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఒక్కో గృహానికి రూ.2.5 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిష్టు, కొలాం సంఘం నాయకులు జల్లు, పగ్గు, ఐటీడీఏ ఏఈ పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కౌటాల: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ శుక్రవారం తెలిపారు. 13వ తేదీ ఉదయం 11 గంటలకు మండల అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ అధ్యక్షతన సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు నివేదికలతో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

సంఘం బలోపేతానికి కలిసిరావాలి



సభ్యత్వం నమోదు చేస్తున్న సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో డీడీఎస్ అర్చకుల సంఘం బలోపేతానికి కలిసి ముందుకు రావాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్‌రావ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ తెలిపారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని హనుమాన్ ఆలయంలో డీడీఎస్ అర్చకుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్చకుల సమస్యల పరిష్కారానికి సంఘం అంకిత భావంతో పనిచేస్తుందని, అందుకోసం ప్రతి ఒక్క అర్చకుడు సహకరించాలని కోరారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలో అర్చకుల సమస్యలపై హైదరాబాద్‌లో అర్చక గర్జన ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 50శాతం సభ్యత్వ నమోదు జరిగిందని, మిగతా వారు త్వరగా నమోదు చేసుకోగలరని కోరారు. కార్యక్రమంలో అర్చకులు ప్రశాంత్, సూర్యనారాయణ, వెంకటసాయి, రఘురామశర్మ, మహేష ఉపెందర్‌చారి, నాగయ్య, వెంకటేశ్వర్, జయక్రుష్ణ, శ్రీకాంత్‌శర్మ, శివరాం, ధన్‌రాజ్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

హట్టిలో వ్యాధుల నివారణపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కెరమెరి: మండలంలోని హట్టి గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాత నిర్వహించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై పాటల రూపంలో గ్రామీణులకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, నీరు నిల్వ ఉండకుండా ఉండాలని, మురుగుకాల్వలు శుభ్రం చేయాలని, వేడి చేసి కాచిన నీటిని తాగాలని పాటల ద్వారా అవగాహన కల్పించారు. వ్యాధులు నివారణకు ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైద్యాధికారి వినోద్‌కుమార్, ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేన్ ఉన్నారు.

ఎన్నికలపై అవగాహన ఉండాలి



పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తున్న విద్యార్థులు

కౌటాల: విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై అవగాహన ఉండాలని హెచ్ఎం ఫాదర్ టోమ్ థామస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో మంచి నాయకుడి లక్షణాలు కలిగిన వారు ఉంటారని తెలిపారు. 18 ఏళ్లు నిండిన అనంతరం ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో నిజాయితీ పరులైన నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. చదువుతో పాటు సమాజంలోని అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత దేశ ఎన్నికల నిర్వహణపై విద్యార్థులు అవగాహన ఉండాలనే ఉద్దేశంతో ఏటా పాఠశాలలో విద్యార్థుల ఎన్నికల పోటీ నిర్వహిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు ఎన్నికల్లో పాల్గొన్నారు.

కేంద్ర పర్యావరణ, అటవీ అధికారుల పర్యటన



ఖైరిగూడ ఓసీని పరిశీలిస్తున్న అధికారులు

రెబ్బెన: బెల్లంపెల్లి ఏరియాలో శుక్రవారం కేంద్ర పర్యావరణ, అటవీశాఖ అధికారి డాక్టర్ మంజునాథ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఖైరిగూడ, బీపీఏ ఓసీ–2, గోలేటి –1ఏ గనులను ఆయన సందర్శించారు. అటవీశాఖ అనుమతులు పొందిన భూమిలో చేపట్టిన పనులు, నిర్మాణాలను పరిశీలించారు. కట్టడాలు, సెటిల్‌పాండ్స్, సేఫ్టీజోన్‌లను తనిఖీ చేశారు. వట్టివాగు రిజర్వాయర్ వద్ద కొనసాగుతున్న పనులను తనిఖీ చేశారు. అనంతరం సింగరేణి ఆధ్వర్యంలో నాటిన మొక్కలు, పెంచిన వృక్షాలను పరిశీలించారు. అటవీ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అడ్వైజెయిరి ఫారెస్ట్ సుందేంద్ర పాండే, జీఎం రవిప్రసాద్, ఎస్ఓటూ జీఎం నరేందర్, పీవోలు సత్యనారాయణ ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే



రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర కమిటీ అధికారులు

వాంకిడి: మండలంలోని ఇందాని, వెల్గీ గ్రామ పంచాయతీల్లో కేంద్ర కమిటీ అధికారులు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనులపై సర్వే నిర్వహించారు. పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ, ఇంకుడు గుంతలు వంటి పనులపై ఆరా తీశారు. చెత్త నిర్వహణ, చెత్త నుంచి ఎరువుల తయారీని పరిశీలించారు. రికార్డుల ప్రకారం నిర్మించిన ఇంకుడు గుంతలను సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే గ్రామ పంచాయతీల్లో రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ అధికారులు రాకేష్, సునీల్, స్వచ్ఛ సర్వేక్షన్ సభ్యులు ఫని కుమార్, సాయిక్రిష్ణ, ధర్మ, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీవో శివకుమార్, ఏపీవో శ్రావణ్ కుమార్ ఉన్నారు.

పోస్టల్ డబ్బులు చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

చింతలమానెపల్లి: పోస్టల్ శాఖలో ఆర్‌డీ ద్వారా నిల్వ చేసుకున్న డబ్బులు చెల్లించడం లేదని చింతలమానెపల్లి మండలం బాలాజీఅనుకోడలోని పెన్షన్ లబ్ధిదారులు శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఇతర పెన్షన్‌దారులు స్థానిక పోస్ట్‌మాస్టర్ వద్ద ప్రతినెలా రూ.500, రూ.200 చొప్పున ఆర్‌డీ పాలసీలో డబ్బులు చెల్లించామని తెలిపారు. ఐదేళ్ల డబ్బులు చెల్లించగా, కాల పరిమితి ముగిసిన అనంతరం సంప్రదిస్తే సిర్పూర్ సబ్ పోస్ట్‌మాస్టర్ స్పందించడం లేదని ఆరోపించారు. తమ డబ్బులు కాజేశారని వాపోయారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీరికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డుబ్బుల వెంకన్న మద్దతు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే బాధితులతో కలిసి పోస్టల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాంకిడి: మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి ఏఈ శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.